క్లుప్తంగా

బీఎల్‌ఓ యాప్‌లో వివరాలు సకాలంలో పొందుపరచాలి



నకరికల్లు: బీఎల్‌ఓలు తమకు కేటాయించిన యాప్‌లో సకాలంలో అన్ని వివరాలు పొందుపరచాలని తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్‌లకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరుకార్డుకు ఆధార్‌లింక్, ఎలక్షన్స్ క్లెయిమ్స్ త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. కొత్తగా రూపొందించిన ఈఆర్ఓ, బీఎల్ఓ యాప్‌ల ద్వారా గురించి ఎన్నికల సంఘం వారి ఆదేశాల మేరకు పనిచేయాలన్నారు. అధికారులకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఆయాయాప్‌లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వలంటీర్లలో సేవావజ్రగా ఓరుగంటి అనూషా



అమరావతి: ప్రజల దగ్గరకు పరిపాలనను తీసుకువచ్చే గ్రామ సచివాలయ వలంటీర్లకు ఇచ్చే అవార్డుల్లో దిడుగుకు చెందిన ఓరుగంటి అనూషా సేవావజ్రగా ఎంపికైనట్లు ఎంపీడీఓ మాధురి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నరుకుళ్లపాడుకు చెందిన నల్లిబోయిన శ్రీకాంత్, అత్తలూరుకు చెందిన జి. బ్రహ్మయ్య, అమరావతికి చెందిన కె ఉషారాణి, ఉంగుటూరుకు చెందిన శ్రీహరిశివాజీ, వుకుంతపురంకు చెందిన నండూరి శ్రీనివాసరావులు సేవారత్నలుగా ఎంపియ్యారని తెలిపారు.


జనసేన నాయకుల దౌర్జన్యంపై ఫిర్యాదు

సత్తెనపల్లి: జనసేన నాయకుల దౌర్జన్యం పై సత్తెనపల్లి మండలం ధూళ్ళిపాళ్ల గ్రామానికి చెందిన మట్టం శ్రీకాంత్ గురువారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ధూళ్ళిపాళ్ల గ్రామానికి చెందిన మట్టం కోటేశ్వరరావు ఆయన కుమారుడు శ్రీకాంత్‌లు పట్టణంలోని బైపాస్‌రోడ్ లో ఓ పానీపూరి బండి వద్ద గురువారం పానీ పూరి తింటున్నారు. అదే క్రమంలో జనసేన నాయకుల కాన్వాయ్ కనిపించడంతో మట్టం కోటేశ్వరరావు కాన్వాయ్ వద్దకు వెళ్లి గతంలో తన కుమారుడు మట్టం అశోక్ చనిపోయినప్పటికీ పవన్ కళ్యాణ్‌ను కలిపి న్యాయం చేస్తానని చెప్పి మాట తప్పడం ఏమిటని అడిగాడు. దీనికి జనసేన నాయకులు మాట్లాడుతూ ఎంతోమంది చస్తుంటారు, చచ్చినవారందరికీ పవన్ కళ్యాణ్ కలవాలనా అంటూ కోపోద్రేకంగా తమ పైకి వచ్చి వల్లెం శ్రీనివాసరావు అలియాస్ రాడ్లు శ్రీను, శిరిగిరి మణికంఠలు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. కారులో ఉన్న జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు సైతం కళ్ళు ఎర్రజేసి చేతి వ్రేళ్ళు చూపుతూ హెచ్చరికలు చేశాడన్నారు. తమపై దౌర్జన్యం చేసిన జనసేన నాయకులపై చట్టపరమైన చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నాటుసారాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు ఎస్ఈబీ అధికారులు గురువారం అచ్చంపేట మండలం రోకలిగుంట వారిపాలెంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారాయి విక్రయిస్తున్న గొర్రెశ్రీనివాసరావు అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాయి స్వాధీన పరుచుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్ తులసి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



అచ్చంపేట: రోడ్డు ప్రమాదంలో పెదపాలెం గ్రామానికి చెందిన షేక్ లాలూసాహెబ్(55) నల్గొండ జిల్లా, పెదరావూరు మండలం చింతపల్లికి సమీపంలో జడ్చర్ల, కోదాడ రహదారి మార్గంలోని కాలువలో పడి మృతి చెందిన ఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పెదపాలెం వమానిక చెందిన షేక్ లాలు, భార్య, ఇరువురు పిల్లలతో పరదాపట్టాలు అమ్ముకునేందుకు బైకుపై వెళ్లాడు. పట్టాలు అమ్ముకోవడమే ఇతని వృత్తి. బైకుపై వెళ్తుండగా కోదాడ, జడ్చర్ల రహదారి పక్కనే ఉన్న కాలువలో పడి అక్కడికక్కడే మృతిచెందినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన ఘటన సత్తెనపల్లి మండలం పాకాల పాడు గ్రామ సమీపంలో గురువారం జరిగింది. సత్తెనపల్లి నుంచి రెంటపాళ్ళ ప్రయాణికులతో వెళ్తున్న ఆటో పాకాలపాడు సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మండల సమగ్రాభివృద్ధికి కృషి చేద్దాం

- మంత్రి అంబటి రాంబాబు
- మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం



గృహనిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావును ప్రశ్నిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: మండల సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. గురువారం సత్తెనపల్లి మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి ఎంపీపీ షేక్ యలవర్తిపాటి జై బూన్ బి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ వేసవి కాలంలో మండల పరిధిలో జరుగుతున్న నాడు –నేడు, పక్కా గృహ నిర్మాణాలు తదితర శాఖల పనులు సకాలంలో నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా వేగవంతం గా పూర్తయ్యేలా ప్రజాప్రతి నిధులు, అధికారులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాల న్నారు. సెలవులు పూర్తయ్యేలోగా పాఠశాలలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, మంచినీరు, వంట గదులు, అదనపు గదుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. మండల పరిధిలో కేటాయించిన పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న సమస్యలను పరిష్కరించు కునేందుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వేదిక కావాలని సూచించారు. వివిధ శాఖల మండల స్థాయి అధికారులు వారి ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో రైతు సలహా మండలి రాష్ట్ర సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి, ఎంపీడీఓ జీవీ.సత్యనారాయణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది ఉన్నారు.


సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు

మిరపలో సస్యరక్షణపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని

బయ్యవరం(క్రోసూరు): మండలంలోని బయ్యవరం గ్రామంలోని రైతుభరోసా కేంద్రం వద్ద ఉద్యానశాఖ అధికారి సీహెచ్ జనని ఆధ్వర్యంలో మిరపసాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రస్తుతం వేసవిలో లోతుదుక్కులు తీసుకోవాలన్నారు. రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నవి వేసుకోవాలన్నారు. మిరపలో వేరుకుళ్లు, వేరుపురుగు ముందస్తు నివారణకు ఎకరాలకు 200 కేజిలు వేపపిండితో పాటు రెండు కిలోల ట్రికోడెర్మ, రెండుకిలోల సూడోమనాస్,ఐదుకిలోల వామ్(వీ.ఏ. ఎం) కలిపి వారం రోజులుంచాలన్నారు. చివరిదుక్కి సమయంలో వేసుకోవాలన్నారు.ప్రస్తుతం పండ్లతోటలు సాగు చేయాలనుకునే రైతులు ముందుస్తుగా భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలన్నారు.డ్రిప్, స్ప్రింకర్లు కావాల్సిన రైతులు రైతుభరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఉద్యానశాఖకు సంబంధించిన పథకాలు, పీఎం–ఎఫ్ఎంఈ పథకం ఫుడ్ ప్రాసెసింగ్‌లో 10 శాతం రైతు చెల్లిస్తే, 90 శాతం బ్యాంకు రుణంగా ఇస్తుందన్నారు. దానిలో 35 శాతం సబ్సిడీ రాయితీ ఉందన్నారు.కారం, పసుపు, పచ్చళ్లు, పొడులు, గానుగ, రైస్, పిండి మరకు, సంబంధించిన మెషీన్లకు పీఎం- ఎఫ్.ఎం,ఈ కింద రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయసహాయకులు ఉష, సర్పంచ్, ఎంపీటీసీ, రైతులు పాల్గొన్నారు.

లైసెన్సు ఉన్న షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేయాలి

వ్యవసాయ శాఖ అధికారిణి శాంతి


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ అధికారిణి శాంతి

పెదకూరపాడు: రైతులు లైసెన్సు కలిగిన అధీకృత డీలరు వద్ద మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ శాఖ అధికారిణి శాంతి రైతులకు తెలిపారు. మండలంలోని బుస్సాపురం గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ఖరీఫ్ సాగుకు సన్నద్ధమవుతున్న రైతులకు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించి బిల్లు, విత్తన ప్యాకెట్లను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచు కోవాలన్నారు. వేసవిలో భూసార పరీక్షలు,పచ్చిరొట్ట విత్తనాల ప్రాముఖ్యత, సీసీఆర్సీ కార్డులు తీసుకోవడం వల్ల రైతులకు ఉపయోగాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు మహేష్, సాదిక్ పాల్గొన్నారు.

వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కుతో రైతులకు మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న నాగశేఖర్

పెదకూరపాడు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షపథకం ద్వారా రైతులకు ఎంతో ఉపయోగం ఉంటుందని జిల్లా సర్వే, ల్యాండ్ రికార్డుల అసిస్టెంట్ డైరెక్టర్ నాగశేఖర్ అన్నారు. మండలంలోని 75 త్యాళ్లూరు గ్రామంలో సచివాలయం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీరాజ్ సంయుక్త భాగస్వామ్యంతో గ్రామ, వార్డు సచివాలయాల ఆధ్వర్యంలో సమగ్ర భూసర్వే నిర్వహిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4,500 సర్వేబృందాలు ప్రతి మండలానికి మొబైల్ మెజిస్ట్రేట్‌ల ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. సర్వే, రెవెన్యూ రికార్డుల వివరాలు, డిజటల్ రూపంలో పొందుపరుస్తున్నామని తెలిపారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తున్నామని, రైతులు స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు. ఆర్డీఓ కార్యాలయం సర్వే ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, డివిజన్ సర్వే ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పెదకూరపాడు డెప్యూటీ తహసీల్దారు నిర్మలాకుమారి, పెదకూరపాడు సర్వేయర్ మాధవ, అచ్చంపేట సర్వేయర్ శ్రీకాంత్, వీఆర్వో ప్రసాద్, గ్రామ సర్వేయర్ గోగుల పాటి కోమలి పాల్గొన్నారు.

ఘనంగా మ్యూజియం డే


మ్యూజియం డే సందర్భంగా వివిధ పోటీల విజేతలతో మ్యూజియం అధికారులు

అమరావతి: స్థానిక పురావస్తు సంగ్రహాలయ ప్రాంగణంలో గురువారం ఇంటర్నేషనల్ మ్యూజియం డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భారతీయ పురావస్తు సర్వేక్షణ విభాగం డీఈ వీరాంజనేయులు మాట్లాడుతూ గత చారిత్రక వైభవాన్ని స్మరించుకుంటు, చరిత్రక కట్టడాలను శిల్పకళను పరిరక్షించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కనమరుగైపోతున్న భారతీయ చారిత్రక చిహ్నాలను భవిష్యత్ తరాల వారికి అందించడానికి అందరు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా భారతీయ పురావస్తు సర్వేక్షణ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు, ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్కియాలజిస్టు సూర్యప్రకాష్, యుడిసి ఫణీంద్ర, చినబాబులతో పాటుగా వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్వో, నాయకులు

బెల్లంకొండ: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని అటవీ శాఖ పాపాయపాలెం సెక్షన్ డీఆర్వో రమణయ్య తెలిపారు. గురువారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలో పర్యావరణం పరిరక్షణ, ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించడానికి సాధ్యమయ్యే మార్గాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పర్యావరణాన్ని కాపాడాలంటే ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించడమే మార్గమని తెలిపారు. అనంతరం ప్రధాన సెంటర్‌లో పర్యావరణహిత జీవన విధానం గురించి వివరించారు. నీటిని పొదుపుగా వినియోగించాలని, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలను తీసుకోవడం వంటి వాటిపై అవగహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణకు గ్రామస్థులతో అటవీ శాఖ సిబ్బంది ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ చిమటా మాధవి, వెంకటసైదయ్య, ఎంపీటీసీ మర్రి శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు రాకేష్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా సత్తెనపల్లి పురపాలక సంఘం పరిధిలో మేరా లైఫ్ మేరా స్వచ్ఛ నగర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి తెలిపారు. రెడ్యూస్, రీసైకిల్, రియూజ్ (ఆర్ఆర్ఆర్) కార్యక్రమాన్ని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ప్రారంభించి మాట్లాడారు. వచ్చే నెల 5 వరకు 15 ఆర్ఆర్ఆర్ సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కేంద్రాల్లో ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న దుస్తులు, బూట్లు, చెప్పులు, పరుపులు, పుస్తకాలు, బ్యాగులు, పిల్లలు ఆడుకునే బొమ్మలు, సైకిళ్ళు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర సామాగ్రిని అందజేయ వలసిందిగా కోరారు. తమ పరిధిలోని కేంద్రంలో వీటిని అందించి సదరు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే నెలలో నిర్వహించే పర్యావరణ పరిరక్షణ దినోత్సవం లో భాగంగా కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాలు మేరకు మేరా లైఫ్ మేరా స్వచ్ఛ షహార్ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ పార్థసారధి, సిబ్బంది పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి మంత్రి పరామర్శ

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామ సర్పంచ్ సింగంశెట్టికోటేశ్వరమ్మ భర్త తాతయ్య(70) మృతదేహాన్ని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు గురువారం సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. తాతయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యాడు. బుధవారం తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. సమచారం తెలుసుకున్న మంత్రి అంబటి రాంబాబు గ్రామానికి చేరి సర్పంచ్ కుటుంబ సభ్యులను పరామర్శించాడు. కుటుంబానికి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఆయనతో పాటుగా వైఎస్సార్ సీపీ నాయకులు ఎమ్‌జెఏమ్‌రామలింగారెడ్డి, ఎంపీటీసీ అంజయ్య, ఉపసర్పంచ్ సైదా, వైఎస్సార్ సీపీ నాయకులు కానాలపుల్లారెడ్డి, చిమటాశ్రీనివాసరావు, వెంకటరెడ్డి, నాగిరెడ్డి, జయరావు, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: మండల పరిధిలోని బృగుబండలో అన్నదాసు విశ్వేశ్వరరావు గురువారం మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా సమాచారం తెలుసుకున్న రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్ వైద్య సేవలు


నందిగామలో నడవలేని వారి గృహానికి వెళ్లి సూచనలు చేస్తున్న డాక్టర్ శ్రీలక్ష్మీకవిత

సత్తెనపల్లి: మండలంలోని నందిగామలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు. శ్రీలక్ష్మీ కవిత గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 165 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 51 మంది, హైపర్ టెన్షన్ 30 మంది, డయాబెటిస్ 17 మంది, గర్భవతులు 13 మంది, బాలింతలు ఐదుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి సూచనలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జే సంపూర్ణ దేవి, ఎమ్ఎల్‌హెచ్‌పి ఆరుద్ర గణేష్, ఏఎన్ఎం డి.జ్యోతి, హెల్త్ అసిస్టెంట్ షేక్ సుభాని, ఆశ కార్యకర్తలు టీ.కమల కుమారి, డి.శ్రీదేవి, ఉన్నారు.

రెంటపాళ్ల గ్రామంలో...

రెంటపాళ్లలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో భాగంగా పీపీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ సాయితేజరెడ్డి గురువారం వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 375 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో జనరల్ ఓపి 22 మంది, హైపర్ టెన్షన్ 151 మంది, డయాబెటిస్ 156 మంది, గర్భవతులు 32 మంది, బాలింతలు ముగ్గురు, జ్వరాలకు సంబంధించి ముగ్గురు, బెడ్ రైడెన్ ముగ్గురు, చిన్నారులు ఐదుగురు ఉన్నారు. అనంతరం దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నడవలేని వారి గృహాలకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు ఆరోగ్య విషయాల పై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్వైజర్లు ఎం.వెంకటేశ్వర్లు, పిఎం మార్గరేట్, సిహెచ్‌ఓ పల్లె సారిక, ఏఎన్ఎం జి కోటేశ్వరమ్మ, హెల్త్ అసిస్టెంట్ జె.బాబు, డిఇఓ ఇజ్రాయిల్, ఆశ కార్యకర్తలు పి.రాధాకుమారి, పి.పద్మజా, జి. సీతమ్మ ఉన్నారు.

రాజుపాలెం: మండలంలోని అంచులవారిపాలెంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో 114 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. 14 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. పది మంది గర్భిణులకు, ఐదుగురు బాలింతలకు, ఐదుగురు పిల్లలకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

పండ్లతోటలకు నూరుశాతం రాయితీ


రైతులకు సూచనలిస్తున్న మండల వ్యవసాయాధికారి దేవదాసు, ఉద్యానవనశాఖాధికారి

నకరికల్లు: వేసవిలో లోతుదుక్కులు చేసుకోవడం ద్వారా సాగుచేయబోయే పంటలకు చీడపీడల బెడద అరికట్టవచ్చని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలోని సచివాలయం-1, 2 పరిధిలో ఖరీఫ్ సాగుకు సమాయత్తం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు సాగుచేయడం ద్వారా నేలలో సేంద్రియ కర్బనం పెరిగి నేలస్వభావం సాగుకు అనుకూలంగా మార్చుకోవచ్చన్నారు. 50 శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యానవన అధికారి దాసరి నవీన్‌కుమార్ మాట్లాడుతూ ఐదెకరాలలోపు పండ్లతోటలు సాగుచేసే రైతులకు ఉపాధిహామీ పథకం ద్వారా నూరుశాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఐదెకరాలకు పైగా సాగుచేస్తున్న రైతులకు ఉద్యానవనశాఖ ద్వారా 40శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు పెట్టదలచుకున్న రైతులకు 90శాతం రుణం లభిస్తుందని, అందులో 35 శాతం రాయితీ నేరుగా రైతుఖాతాలో జమ చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు రైతుభరోసాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సిబ్బంది నవాజ్ షరీఫ్, సాయివెంకట్, వీఆర్వో ప్రసన్నకుమారి, రైతులు పాల్గొన్నారు.

టీబీ రోగులు బలమైన ఆహారం తీసుకోవాలి

పల్నాడు జిల్లా లెప్రసీ వైద్యాధికారిణి పద్మావతి



రోగులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ పద్మావతి

సత్తెనపల్లి: టీబీ రోగులు బలమైన ఆహారాన్ని తీసుకోవాలని పల్నాడు జిల్లా లెప్రసీ, టీబీ, హెచ్ఐవి వైద్యాధికారిణి డాక్టర్ టీ పద్మావతి అన్నారు. సత్తెనపల్లి ఏరియా వైశాల్ లోని పీపీ యూనిట్‌ను గురువారం సందర్శించి లెప్రసీ రోగుల పట్ల సిబ్బంది వ్యవహ రించవలసిన తీరు, వారి పట్ల చూపిస్తున్న ఆదరణను తెలుసుకుని సిబ్బందిని కొనియాడారు. అనంతరం యూపీహెచ్‌సీ వైద్యాధికారులైన డాక్టర్ ధర్మాసింగ్, డాక్టర్ సిరాజున్నీసా, డాక్టర్ అనూష, డీపీఎంలు నాగేశ్వరరావు నాయక్, సింహాద్రిలతో సమావేశమయ్యారు. టీబీ యూనిట్‌ను సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.రోగులు ఎక్కువగా నమోదవుతున్న ప్రాంతంలో యాక్టివ్ కేస్ ఫైండింగ్ సర్వే చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్స్ ఎస్. స్టాలిన్, షేక్ ఇబ్రహీం, ఎల్‌టీ కెసీ హెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టీబీ పేషంట్లకు న్యూట్రిషన్స్ పంపిణీ

క్రోసూరు: క్రోసూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమలో భాగంగా గురువారం టీబీ పేషంట్లకు న్యూట్రిషన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా వైద్యఅధికారి డాక్టర్ బాలఅంకమ్మ మాట్లాడుతూ టీబీ రోగులు మందులు వాడుతున్న సమయంలో బలమైన ఆహారం తీసుకోనేందుకు ఫుడ్ బాస్కెట్ల ను అందచేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ సౌజన్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఐద్వా ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ


పట్టణంలో క్యాండిల్స్‌తో నిరసన ప్రదర్శన చేస్తున్న ఐద్వా నాయకులు

సత్తెనపల్లి: మహిళా మల్ల యోధులు రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌లు వెంటనే రాజీనామా చేయాలని ఐద్వా సత్తెనపల్లి పట్టణ కార్యదర్శి గద్దె ఉమాశ్రీ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక పుతుంబాక భవన్ ఆవరణలో కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్, హర్యానా మంత్రి సందీప్ సింగ్‌ను అరెస్టు చేయాలని కోరుతూ గత 20 రోజులుగా ఢిల్లీలో రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోతుందన్నారు. మహిళలపై దాడులకు పాల్పడిన వారి పై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం బాధితులపై దాడులు చేసి హత్యలు చేస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రకమైన విధానాలను ప్రజాతంత్ర వాదులందరూ ఖండించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఇప్పటికైనా దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేనిచో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె హెచ్చ రించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ధరణికోట విమల,గుంటుపల్లి రజిని, తుమ్మల లక్ష్మి, స్పందన, కోటేశ్వరమ్మ, షేక్ సైదులు, రాజకుమార్, హరి పోతు రాజు, మస్తాన్‌రావు, పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అర్లానందస్వామి జయంతి


ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తున్న చర్చి ఫాదర్స్

అచ్చంపేట : మండలంలోని తాళ్లచెరువులో గ్రామ సృష్టికర్త స్వామి అర్లాంద జయంతిని గురువారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ పుట్టి అంతోనిరాజు, విచారణ గురువులు రెవ.ఫాదర్స్ కఠారి కిరణ్‌కుమార్, ఏరువ లూర్దుమర్రెడ్డి, తుమ్మా ప్రతాప్‌రెడ్డి, నాగోతు సునీల్‌తో పాటు 25 మంది గురువులు, బూబ్లీగురువులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. ముందుగా గ్రామ నడ్డిబొడ్డులోని అర్లానందస్వామి విగ్రహానికి పలువురు గ్రామ పెద్దలు పూలదండులు వేసి ఘన నివాళులర్పించారు. కీరారణ్యంగా ఉండే ఈ ప్రాంతాన్ని దర్శించడానికి సుమారు 110 సంవత్సరాల క్రితం హాలెండ్ నుంచి వచ్చిన అర్లానంద స్వామి స్వామి ఈ ప్రాంతాన్ని వ్యవసాయానికి అనుకూలమైనది గుర్తించి ఇక్కడే ఒక గ్రామాన్ని నిర్మించాలన్న ఆలోచనతో కొంత మంది క్రైస్తవ మతస్తులను చేరదీసి చిన్న గ్రామాన్ని నిర్మించారు. ఇక్కడ ఉండే చెరువు చూట్టు తాడిచెట్లు ఎక్కువగా ఉండడంతో తాళ్లచెరువుగా నామకరణ చేశారని చరిత్రకారులు చెబుతున్నారు. ఇప్పుడు ఈ గ్రామంలో 5 వేల జనాభాగా, వ్యవసాయ ప్రాధాన్యత గల గ్రామంగా విరాజిల్లుతోంది. పాత గుంటూరు జిల్లాలోనే ఇక్కడ పండించే మిర్చికి ప్రాధాన్యత ఉంది. గ్రామస్తులంతా అర్లానందస్వామి స్వామి వేడుకలను పండుగలా, ఒక తిరునాళ్లగా జరుపుకున్నారు. పలు ప్రాంతాల నుంచి స్వామి భక్తులు భారీగా తరలి వచ్చి వేడకల్లో పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు మెడికల్ కిట్ల పంపిణీ


కూలీలకు కిట్లు పంపిణీ చేస్తున్న చిన్నప్ప

సత్తెనపల్లి: వాసవిమెడికల్, మేకల విజయబాబు సహకారంతో దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో సత్తెనపల్లి మండలం కట్టమూరు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు 10 రకాలు మెడికల్ కిట్లును దళిత బహుజన రిసోర్స్ సెంటర్ పల్నాడు, గుంటూరు జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప గురువారం పంపిణీ చేశారు. చిన్నప్ప మాట్లాడుతూ జాతీయ ఉపాధిహామీ పథకం కింద ఉన్న ఉరులోనే ఉపాధిఅనే అంశాన్ని మనం గుర్తుంచుకుని ఎక్కువ మంది కూలీలు పనులకు రావాలన్నారు. ప్రతిఒక్కరూ జాబ్ కార్డులు తీసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి బాటలు వేయాలంటే వీలైనంత ఎక్కువ మంది ఉపాధిహామీ పథకం పనులకు రావాలని, మన పనులు మనము చేసుకొంటూ అదనంగా ఆదాయాన్ని పొందటానికి అవకాశం ఉంటుందని కూలీలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కట్టమూరు ఫీల్డ్ అసిస్టెంట్ మాతంగి అంజిబాబు, ముఠా మేస్త్రి దార్ల చెన్న కేశవులు, ఉపాధిహామీ కూలీలు 50 మంది పాల్గొన్నారు.

స్వామివారికి మకరతోరణం బహూకరణ

నకరికల్లు : మాసశివరాత్రి పురస్కరించుకుని మండలంలోని నర్సింగపాడులో వేంచేసి ఉన్న శ్రీ మరకత లింగ చంద్రమౌళీశ్వరస్వామి వారికి హైదరాబాద్‌కు చెందిన నరహరి, రమాదేవి దంపతులు 3కేజీల వెండిమకరతోరణాన్ని గురువారం స్వామివారికి బహూకరించారు. ఆలయ అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వామివారి పట్ల విశ్వాసంతో రూ.2.10 లక్షల విలువైన వెండి మకరతోరణాన్ని అందజేశారన్నారు. దాతలకు అభినందనలు తెలిపారు. అనంతరం మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి విశేష ద్రవ్యములతో అభిషేకాలు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివార్లను దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.